సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 19 । ఆగస్టు । 2023



మావుళ్లమ్మా.. దీవించమ్మా

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో భీమవరం మావుళ్లమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



జాతీయ గుర్తింపు

పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు గుర్తింపుగా జిల్లాలోని ఇద్దరు సర్పంచ్‌లకు జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొనే అవకాశం దక్కింది. IIలో ▸



కొడుకుపై దాడి

మద్యం మత్తులో కుమారుడిపై చాకుతో తండ్రి దాడి చేసిన సంఘటన తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేట గ్రామంలో చోటుచేసుకుంది. IIలో ▸

న్యూస్‌రీల్

మంత్రి కొట్టును కలిసిన ఎంపీ అనురాధ



మంత్రి కొట్టు సత్యనారాయణను కలిసిన అమలాపురం ఎంపీ చింతా అనురాధ

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను అమలాపురం ఎంపీ చింతా అనురాధ శుక్రవారం కలిశారు. అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఆలయాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఆలయాల అభివృద్ధి ప్రతిపాదనలను మంత్రి కొట్టుకు అందజేశారు. రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి, ధర్మప్రచార పరిషత్ కార్యక్రమాలపై నిర్వహణపై చర్చించారు.

రీ సర్వేలో ముందుండాలి



మాట్లాడుతున్న జేసీ రామసుందర్ రెడ్డి

భీమవరం (ప్రకాశం చౌక్): రీ సర్వేలో పశ్చిమగోదావరి జిల్లా ప్రగతి సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి రీ సర్వే, భూ బదిలీ హక్కులపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వే అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రీ సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. ప్రతి రైతుకి నోటీసు అందించాలన్నారు. తొలి విడత రీ సర్వేలో జిల్లా మంచి ప్రగతిని సాధించిందని, రెండో విడతలోనూ ఇదే స్ఫూర్తి కొనసాగించాలన్నారు. రీ సర్వేకు సంబంధించి ఇప్పటివరకు 46 గ్రామాలకు 30 నోటిఫికేషన్లు జారీ చేశామన్నారు. ఆయా గ్రామాల్లో సర్వే రాళ్లను పాతించి రైతులకు చూపించాలని తహసీల్దార్లను ఆదేశించారు. అలాగే 2003 ముందునాటి అసైన్డ్ భూములకు సంబంధించి అధికారులకు సూచనలు జారీ చేశారు. డీఆర్వో కె.కృష్ణవేణి, జిల్లా సర్వే అధికారి జాషువా, భూ విభాగం పర్యవేక్షకులు సీహెచ్ రవికుమార్ పాల్గొన్నారు.

మంచి మార్కులు సాధించాలి

సాక్షి, భీమవరం: పట్టణంలోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ (పీఎస్‌ఎం) గరల్స్ హైస్కూల్‌ను శుక్రవారం ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ జాయింట్ సెక్రటరీ మేరీ చంద్రిక సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి ఇప్పటినుంచి కష్టపడి చదవాలని సూచించారు. పాఠశాలల్లో ప్రభుత్వం సమకూరుస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతి స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. భీమవరం డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డి.శ్రీరామ్, హెచ్‌ఎం జె.సుధారాణి, ఉపాధ్యాయులు వీఎం రాధాకృష్ణ, చిట్టికుమారి, ఎం.సీతారామ్ ఆమె వెంట ఉన్నారు.

డీఎస్‌ఈఓగా ప్రభుకుమార్



సాక్షి, భీమవరం: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ (డీఎస్ఈఓ)గా కేవీఎన్ ప్రభుకుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ప్రభుకుమార్ గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఏఈఎస్‌గా మూడేళ్లు పనిచేశారు. అలాగే విజయవాడ ఎక్సైజ్ కమిషనర్ కేంద్ర కార్యాలయంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ హోదాలో అసిస్టెంట్ సెక్రటరీగా విధులు నిర్వహించి అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొంది ఎక్సైజ్‌శాఖ నుంచి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకు బదిలీపై వచ్చారు. భీమవరంలో ఆయనకు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సి.భార్గవ, సెబ్ ఇన్‌స్పెక్టర్ వర్మ, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.కోటేశ్వర్ తదితరులు స్వాగతం పలికారు.

ధాన్యం సేకరణకు ముందస్తు చర్యలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల తదితర అంశాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఏలూరు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ధాన్యం కొనుగోళ్ల కమిటీ సమావేశాన్ని (డీపీసీ) నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొనుగోలు చేస్తామని, అధికారులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైతులకు గ్రామ సభల ద్వారా ధాన్యం నాణ్యతా ప్రమాణాలు, గోనె సంచులు, హమాలీల ఖర్చు, రవాణా చార్జీలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గత ఖరీఫ్, రబీలో ధాన్యం కొనుగోలు బాగా జరిగిందన్నారనేలూరు జిల్లాలో 2.30 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని ఆమె తెలిపారు.



కష్టం ఫలించె.. గ్రూప్స్ వరించె..

'గ్రూపు'వీరులు

- ఏపీపీఎస్సీ గ్రూప్–1 ఫలితాల్లో సత్తా
- మెరిసిన 'పశ్చిమ' బిడ్డలు
- సివిల్స్ లక్ష్యంగా అడుగులు

పట్టుదల, అకుంఠిత దీక్ష, పక్కా ప్రణాళికతో అనుకున్నది సాధించారు.. ప్రతిష్టాత్మకమైన గ్రూప్స్‌లో విజయదుందుభి మోగించారు.. దేశస్థాయిలో సివిల్స్‌కు ఎంతటి ప్రాధాన్యమో రాష్ట్రానికి వచ్చేసరికి ఏపీపీఎస్సీ గ్రూప్–1కి అంతేస్థాయి ఉంటుంది. అంతటి పరీక్షల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి యువత సత్తాచాటింది. ఫలితాల్లో పలువురు విజయకేతనం ఎగురవేసి ఉన్నత కొలువులు సొంతం చేసుకున్నారు. తాము పడ్డ కష్టంతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విజయం సాధ్యమైందని విజేతలు అంటున్నారు. ఈ కొలువును ఆసరాగా చేసుకుని సివిల్స్ లక్ష్యంగా ముందుకు సాగుతామని చెబుతున్నారు.

– ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)/తాడేపల్లిగూడెం రూరల్/పెనుగొండ



గ్రూప్‌-1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికైన కదలి జైకృష్ణను అభినందిస్తున్న సిద్ధాంతం గ్రామస్తులు

సీఆర్పీఎఫ్ కమాండెంట్‌గా ఉంటూ..

సీఆర్పీఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా పనిచేస్తూనే ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షలకు సిద్ధమయ్యాను. ఇప్పుడు ర్యాంకు సాధించి డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యాను. ఉత్తరాఖండ్‌లోని రూర్కీలో ట్రిపుల్‌ఐటీ పూర్తిచేశాను. అప్పటినుంచి సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నా. సివిల్స్‌లో మెయిన్స్ సాధించడమే నా ముందున్న లక్ష్యం. ఈ మేరకు యూపీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. తల్లిదండ్రులు కదలి హిమావతి, రామనాగ గోవిందరాజు ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి చేరుకున్నా.

–కదలి జైకృష్ణ, సిద్ధాంతం, పెనుగొండ మండలం

సివిల్స్ సాధించడమే లక్ష్యం



ఏపీపీఎస్సీ గ్రూప్–1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడం గర్వంగా ఉంది. ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేయాలనే తలంపుతో సివిల్స్ సాధించడమే నా లక్ష్యం. డిగ్రీలో పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులు ఎంచుకున్నాను. సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలో తొలి ప్రయత్నంలోనే విజయం సాధించాను. వచ్చేనెల 15న జరిగే మెయిన్స్‌కు సిద్ధమవుతున్నా. ఈ లోపు ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్ష రాయగా తొలి ప్రయత్నంలోనే మొదటి ర్యాంకు సాధించాను. తల్లిదండ్రుల మార్గనిర్దేశనం, వారి త్యాగాలు నన్ను ఈ స్థాయిలో నిలిపాయి.

– గణేశ్న భానుశ్రీ లక్ష్మి అన్నపూర్ణ ప్రత్యూష, సీసలి, కాళ్ల మండలం, పశ్చిమగోదావరి జిల్లా

కలెక్టర్ లవ్ అగర్వాల్ స్ఫూర్తితో..



నా చిన్నప్పుడు పశ్చిమగోదావరి కలెక్టర్‌గా పనిచేసిన లవ్ అగర్వాల్ స్ఫూర్తితో ఐఏఎస్ కావడమే లక్ష్యంగా పెట్టుకున్నా. బీటెక్ పూర్తి చేసిన తర్వాత 2012లో టీసీఎస్‌లో మంచి ప్యాకేజీతో ఉద్యోగంలో చేరినా నా మనసు మాత్రం సివిల్స్‌పైనే ఉండేది. రెండేళ్లు సివిల్స్‌కు కోచింగ్ తీసుకుని ఒకసారి ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. సివిల్స్‌కు ప్రిపేరయ్యే వారికి కోచింగ్ కూడా ఇచ్చాను. ఈ క్రమంలో ఏపీపీఎస్సీ గ్రూప్–1 రాసి ర్యాంక్ సాధించా. ఇది నాకు పెద్ద కష్టమేమీ కాలేదు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేయడమే నా లక్ష్యం. గ్రూప్–1లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యాను.

– కానాల సంగీత్ మాధుర్ నాయుడు, ఏలూరు

మాతృభూమికి సేవ చేయాలని..



మాతృభూమికి సేవ చేయాలని గ్రూప్స్, సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నా. కేంద్ర ప్రభుత్వ హోమ్ ఎఫైర్స్ మినిస్ట్రీలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నా వెలితిగా ఉంది. గతంలో యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలు రాశాను. గతంలో మూడుసార్లు ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షలు రాసి విఫలమైనా ఏ మాత్రం పట్టు వదలలేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ కొలువు కంటే మెరుగైన ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది. అయినా ఇక్కడితో నా ప్రయత్నం విరమించుకోదలుచుకోలేదు. సివిల్స్ సాధించి దేశ సేవకు పునరంకితం కావడమే నా అంతిమ లక్ష్యం. గ్రూప్–1 ఫలితాల్లో డీఎస్పీ కొలువు సాధించడం ఆనందంగా ఉంది.

– రావూరి రామ వెంకట సదాసాయి అభిషేక్, పాలకొల్లు

మరింత పట్టుదలతో సివిల్స్‌కు..



మాది సామాన్య రైతు కుటుంబం. గ్రూప్–1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికకావడం ఆనందంగా ఉంది. ఇప్పటికే గ్రూప్–1కు రెండు సార్లు ప్రయత్నించి విఫలమయ్యాను. ఈసారి ఎలాగైనా ర్యాంకు సాధించాలనే పట్టుదలతో మరింత కష్టపడి పరీక్షలు రాశాను. గ్రూప్–1లో డీఎస్పీ పోస్టు వచ్చినా, ఐఏఎస్ సాధించాలనేది నా ముందున్న లక్ష్యం. వచ్చే నెలలో జరుగనున్న యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్నా. అక్కడ మంచి ర్యాంకు సాధించి ఐఏఎస్ అవుతా. రెండేళ్ల శ్రమ, కృషికి ఇప్పుడు డీఎస్పీ పోస్టు వచ్చింది. డీఎస్పీ ట్రైనింగ్ తీసుకుంటూనే సివిల్స్ సాధిస్తా.

– చావా బాల మహేష్, జగన్నాథపురం, తాడేపల్లిగూడెం మండలం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కలెక్టర్ ప్రశాంతి



ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): ఉద్యోగులు మరింత స్వేచ్ఛగా పనిచేయడానికి ఉద్యోగుల గ్రీవెన్స్ తోడ్పడుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డితో కలిసి ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల నుంచి విజ్ఞాపనలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సర్వీస్ సమస్యలు పరిష్కారమైతే మరింత స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేస్తారన్నారు. ఉద్యోగుల సర్వీస్ మేటర్స్, పెన్షన్ సమస్యలు, ఆర్థికపరమైన అంశాలు, క్రమశిక్షణ కేసులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సమస్యలపై విజ్ఞాపనలను ప్రతినెలా మూడో శుక్రవారం నిర్వహించే ఉద్యోగుల గ్రీవెన్స్‌లో అందజేయాలన్నారు. జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రీవెన్స్‌లో 10 అర్జీలు స్వీకరించారు. అర్జీల్లో కొన్ని..

- తాను తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెం సచివాలయం డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నానని, దివ్యాంగుల కోటాలో ఉద్యోగం పొందానని, దృష్టి లోపంతో ఇబ్బంది పడుతున్నట్టు నల్లజెర్ల వెంకట నారాయణరావు కలెక్టర్‌కు తెలిపారు. తనను తాడేపల్లిగూడెంలో అనువైన పోస్టుకు బదిలీ చేయాలని అర్జీ అందజేశారు.
- తన మెడికల్ రీయింబర్స్‌మెంట్ రూ.లక్ష మరొకరి ఖాతాలో జమయ్యాయని, తన ఖాతాల్లో జమయ్యేలా చూడాలని వడ్డిగూడెం ఎంపీపీ స్కూల్ టీచర్ బాజింకి కృష్ణారావు దరఖాస్తు అందజేశారు.
- తాను దివ్యాంగుడిని కావడంతో విధులకు హాజరవడానికి ఇబ్బంది పడుతున్నానని, తాడేపల్లిగూడెం మండలానికి బదిలీ చేయాలని తణుకు మండలం దువ్వ సచివాలయ సెక్రటరీ శారీరక లక్ష్మణ్‌కుమార్ అర్జీ అందజేశారు.
- భీమవరం కలెక్టరేట్ వెనుక 7వ వార్డులో రోడ్డు అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని, అలాగే కలెక్టరేట్‌లో సెల్ నెట్‌వర్క్ సమస్య ఉందని ఉద్యోగులు కలెక్టర్ ప్రశాంతి దృష్టికి తీసుకువచ్చారు.

21లోపు ఓటరు సర్వే పూర్తి

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా–2024లో భాగంగా ఇంటింటి సర్వే ఈనెల 21లోపు నూరుశాతం పూర్తిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి హాజరయ్యారు. జిల్లాలో ఇప్పటివరకు 85.26 శాతం సర్వే పూర్తయిందన్నారు. జిల్లాలో 14,42,426 ఓటర్లు ఉండగా కొత్త ఓటర్లు 9,206 మంది, మైగ్రేటెడ్ 3,574 మంది, డూప్లికేట్ ఓటర్లు 2,314, షిఫ్టెడ్ ఓటర్లు 4,725 మంది, చనిపోయిన వారు 12,245 మందిని గుర్తించామన్నారు.

జగన్ పాలనలో ప్రతి ఇంటా సంతోషం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



జేసీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జగనన్న సచివాలయ కన్వీనర్లకు (జేసీఎస్) శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతుందని ప్రతి ఇంటా తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఇదే సంక్షేమం కొనసాగాలంటే మరలా జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. గృహ సారథులు, కన్వీనర్లకు వైఎస్సార్ సీపీ బీమా కల్పించిందని, వచ్చేనెల 10వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గ్రామ వార్డు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల బీమా నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాలకు రూ.2.38 లక్షల కోట్లను సంక్షేమ పథకాల ద్వారా అందజేశామన్నారు. 32 లక్షల మందికి సీఎం జగన్ ఇంటి స్థలాలు మంజూరు చేశారన్నారు.

దోచుకోవడమే చంద్రబాబు నైజం

చంద్రబాబు అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రాన్ని దోచుకున్నారని మంత్రి కొట్టు విమర్శించారు. దోచుకోవడానికే ఆయనకు అధికారం కావాలన్నారు. ప్రజల ఇబ్బందులు బాబుకు పట్టవని ధ్వజమెత్తారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఏం మాట్లాడాలో, ఏం మాట్లాడకూడదో తెలియదని విమర్శించారు. జగన్ సంక్షేమ పాలనను నిలిపివేస్తామని, వచ్చే ఎన్నికల్లో ఓడిస్తామని చెప్పడం అతని మిడిమిడి జ్ఞానానికి నిదర్శనమన్నారు. సచివాలయ ఉద్యోగులను తొలగిస్తామంటున్నారని, అది అతడి తాత సొత్తా అని పవన్‌ను ప్రశ్నించారు. నాయకులు కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, మైలవరపు పెదబాబు, కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, కొట్టు విశాల్, దాసరి హైమావతి, బోణం విజయనిర్మల, వెలిశెట్టి నరేంద్రకుమార్, కట్టా రాంబాబు, భావన ధాన్యలక్ష్మి, ముప్పిడి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శిలో కొనసాగిన సోదాలు



ఏలూరులో సోదాలు చేస్తున్న అధికారులు

ఏలూరు టౌన్/తణుకు: ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని మార్గదర్శి కార్యాలయాల్లో సీఐడీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. ఏలూరు ఎన్ఆర్‌పేట, తణుకు, భీమవరం పట్టణాల్లోని కార్యాలయాల్లో రెండోరోజు శుక్రవారం ఉదయం నుంచి అధికారులు రికార్డులు తనిఖీ చేస్తున్నారు. మరో మూడు రోజులపాటు సోదాలు కొనసాగే అవకాశాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో కీలక పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. చిట్స్ వేసిన వినియోగదారులకు నగదు చెల్లింపులు చేశారా? లేదా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. వందల సంఖ్యలో వినియోగదారులకు నగదు చెల్లింపులు చేయకుండా కాలయాపన చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. నగదు సేకరణకు సంబంధించి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనే కోణంలోనూ రికార్డులు పరిశీలిస్తున్నారు. రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాల్సి ఉందని దర్యాప్తు బృందాలు చెబుతున్నాయి.

విద్యుత్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు శుభవార్త

- 37 శాతం వరకు జీతాల పెంపు
- ఉమ్మడి జిల్లాలో 1,110 మందికి ప్రయోజనం
- సీఎం జగన్ నిర్ణయంపై సర్వత్రా హర్షం



భీమవరం ఇండోర్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

భీమవరం(ప్రకాశం చౌక్): విద్యుత్ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వారికి జీతాలు పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. విద్యుత్ శాఖలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఏళ్ల తరబడి జీతాల పెంపు కోసం ఎదురుస్తున్నారు. వారికి ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ జీతాలను 37 శాతం మేర పెంచారు. దీంతో ఏడాది క్రితం చేరిన వారి నుంచి 15 ఏళ్లగా పనిచేస్తున్న ఉద్యోగుల వరకు అందరికీ ప్రయోజనం చేకూరింది.

1,110 మంది ఉద్యోగులు : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆరు విద్యుత్ శాఖ డివిజన్‌ల పరిధిలో 240 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. మొత్తం 1,110 మంది ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్నారు. వారిలో 150 మంది వరకు విద్యుత్ శాఖ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరందరి జీతాలు పెరుగనున్నాయి. ప్రస్తుతం రూ.15 వేలు తీసుకుంటున్న వారు ఇకపై రూ.20 వేలు, రూ.21 వేలు తీసుకుంటున్న వారు రూ.28 వేలు, రూ.22 వేలు తీసుకుంటున్న వారు రూ.30 వేలు అందుకోనున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా	
విద్యుత్ డివిజన్లు	6
సబ్‌స్టేషన్లు	240
ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు	1,110

సర్వత్రా హర్షాతిరేకాలు

ప్రభుత్వం జీతాలు పెంచడంతో విద్యుత్ శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారి దగ్గర నుంచి ఏడాది క్రితమే ఉద్యోగంలో చేరిన వారితో సహా అందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. జీతాలను ప్రభుత్వమే నేరుగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వచ్చే నెల నుంచి..



విద్యుత్ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో ఆరు విద్యుత్ డివిజన్ల పరిధిలోని సబ్‌స్టేషన్లలో మొత్తం 1,110 మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారందరి జీతాలు పెరిగాయి. పెంచిన జీతాలు వచ్చే నెలలో జమ అయ్యే అవకాశం ఉంది.

– పి.సాల్మన్‌రాజు, విద్యుత్‌శాఖ ఎస్ఈ, ఏలూరు

ఏళ్లనాటి కల



నేను 15 ఏళ్లుగా షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాను. జీతాలు పెరుగుతాయని చాలా కాలంగా ఎదురుచూస్తున్నాం. గత ప్రభుత్వంలో పోరాటాలు చేశాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఇచ్చిన మాట ప్రకారం జీతాలు పెంచడం సంతోషం. అయితే ప్రభుత్వమే నేరుగా జీతాలు ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నాం.

–ఎస్.రాజేష్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి, భీమవరం

చాలా ఆనందంగా ఉంది



నేను ఏడాది క్రితం ఔట్ సోర్సింగ్ ద్వారా ఆపరేటర్‌గా చేరాను. ప్రభుత్వం మాకు జీతాలు పెంచడం చాలా సంతోషంగా ఉంది. నాకు ప్రస్తుతం రూ.15 వేలు జీతం వస్తుంది. ప్రభుత్వం జీతం పెంచడంతో రూ.20 వేల వరకు అందుకుంటాను. సీఎం సార్ మాకు మేలు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నా.

– పి.లక్ష్మణ్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి, భీమవరం

నేడు ఉప ఎన్నికల పోలింగ్

1 సర్పంచ్, 10 వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో జరుగనున్న పంచాయతీ ఉప ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్, కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ శాంతియుత వాతావరణంలో వివాదాలకు తావులేకుండా నిర్వహించడానికి ముందస్తు ఏర్పాట్లను పూర్తిచేశామని పేర్కొన్నారు. జిల్లాలో ఒక సర్పంచ్, 10 వార్డు మెంబర్ల పదవులకు శనివారం ఉదయం 7 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఇరగవరం మండలం కావలిపురం సర్పంచ్ పదవికి, వీరవాసరం మండలం మత్స్యపురి, పాలకోడేరు మండలం గొల్లలకోడేరు, పెనుగొండ మండలం దొంగరావిపాలెం, ఇరగవరం మండలం గోటేరు, పెనుమంట్ర మండలం మార్టేరు, తణుకు మండలం తేతలి, పాలకొల్లు మండలం గోరింటాడ, చింతపర్రు, పెంటపాడు మండలం కాస్ప పెంటపాడు, గణపవరంలో వార్డు సభ్యుల ఎన్నికలు జరుగనున్నాయని పేర్కొన్నారు. మొత్తం ఓటర్లు 14,735 మంది ఉన్నారని, సర్పంచ్ పదవికి ఇద్దరు, వార్డు మెంబర్లు పదవులకు 23 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారని తెలిపారు. 20 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసి 120 మందిని ఎన్నికల విధులకు కేటాయించామని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల విజయవంతానికి కృషి చేయాలని కోరారు.

క్లుప్తంగా

రూ.1.33 లక్షల అక్రమ మద్యం పట్టివేత



అదుపులో తీసుకున్న వారితో ఎస్‌ఈబీ పోలీసులు

పెంటపాడు : యానాం నుంచి అక్రమ మద్యాన్ని తరలిస్తున్న వారిని జిల్లా ఎస్ఈబీ పోలీసులు మండలంలోని రావిపాడు వద్ద అరెస్టు చేసి వారి నుంచి రూ.1.33 లక్షల విలువైన అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ రవిప్రకాష్, ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఏటీవీ రవికుమార్ ఆదేశాల మేరకు ఈ దాడులు చేసినట్లు ఎస్ఈబీ పోలీసులు తెలిపారు. ఎస్ఈబీ సీఐ బి.సత్యనారాయణ, ఎస్సై కె.శ్రీనివాసబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పెంటపాడు మండలం రావిపాడు వద్ద ఎస్ఈబీ తనిఖీలలో భాగంగా స్విఫ్ట్ కారులో అత్తిలి మండలానికి చెందిన పంపన గంగాధర్ తిరుపతిపురంలో అమ్మేందుకు రూ.1.33 లక్షల విలువైన మద్యం సీసాలతో వెళ్తుండగా.. ముందస్తు సమాచారం మేరకు అరెస్టు చేశారు. వారి నుంచి సరుకును స్వాధీనం చేసుకుని పంపన గంగాధర్‌తో పాటు, ఉండ్రాజవరానికి చెందిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కారుతో పాటు, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.

25 మద్యం సీసాల స్వాధీనం

ముదినేపల్లి రూరల్: మోటార్‌సైకిల్‌పై తీసుకు వెళ్తున్న మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. స్థానిక రెండో బజారుకు చెందిన పామర్తి రాజా కొంతకాలంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై వెంకటకుమార్ సిబ్బందితో నిఘా వేసి శుక్రవారం ఉదయం మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న రాజాను అదుపులోకి తీసుకుని 24 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్సై రామారావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పంచాయతీల్లో అభివృద్ధికి జాతీయ గుర్తింపు

- జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు ఇద్దరు సర్పంచ్‌లకు ఆహ్వానం
- పెనుమర్రు, దువ్వ సర్పంచ్‌లు గోపి, సూర్య నారాయణమూర్తిలకు అవకాశం

భీమవరం(ప్రకాశం చౌక్): పంచాయతీల్లో సచివాలయ సేవల దగ్గర నుంచి, పారిశుధ్యం మెరుగుదల వరకూ చేసిన అభివృద్ధి వారికి జాతీయ స్థాయి వర్క్‌షాపులో పాల్గొనే అవకాశం కల్పించింది. ఈ నెల 21న జమ్ము కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో సిర్థమైన అభివృద్ధి, లక్ష్యాల స్థానీకరణ అనే అంశంపై జరగనున్న జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు జిల్లాలోని యలమంచిలి మండలం పెనుమర్రు సర్పంచ్ కవురు గోపి, తణుకు మండలం దువ్వ సర్పంచ్ అడ్డ వెంకట సూర్యనారాయణమూర్తి ఎంపికయ్యారు. ప్రతిష్టాత్మకమైన ఈ వర్క్‌షాపునకు జిల్లాలోని రెండు పంచాయతీల నుంచి సర్పంచ్‌లు ఎంపిక కావడం జిల్లా ప్రజలకు గర్వకారణం. జాతీయ స్థాయిలో మన పంచాయతీల ప్రగతిని తెలియచేసే అవకాశం కలగడంతో వారిని అధికారులు, ఆయా గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు.

4 అంశాల్లో ఎంపిక

గ్రామంలో సచివాలయ భవనం నిర్మాణం.. ఆ భవనం నుంచి ప్రజలకు సచివాలయ సేవలు, ఇతర అభివృద్ధి కార్యకలాపాలు అందించడం, సచివాలయం నుంచి ప్రజలకు అత్యధికంగా సేవలు అందించడం, గ్రామంలో పారిశుధ్యం ఎప్పటికప్పుడు మెరుగ్గా ఉంచడం, సర్పంచ్‌గా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండడం తదితర అంశాలపై వీరి ఎంపిక జరిగింది.



దువ్వలో అభివృద్ధి పనులు చేయిస్తున్న సర్పంచ్ అడ్డ వెంకట సూర్యనారాయణమూర్తి



పెనుమర్రులో అభివృద్ధి పనులు చేయిస్తున్న సర్పంచ్ కవురు గోపి

రెండు గ్రామాల్లో అభివృద్ధి ఇలా

దువ్వ పంచాయితీ : తణుకు మండలం దువ్వ పంచాయతీ జనాభా 13,600 మంది. సర్పంచ్ అడ్డా వెంకట సూర్యనారాయణమూర్తి మొదటిసారి సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయానికి పరిపాలన భవనాలను రూ.40 లక్షలతో నిర్మించుకుని ఆ భవనం నుంచి దాదాపు ఏడాది కాలంగా సేవలందిస్తున్నారు. గ్రామంలో రక్షిత మంచినీరు అందిస్తున్నారు. జల జీవన్ మిషన్‌లో చెరువు పనులు చేయిస్తున్నారు. గ్రామంలో సుమారు రూ.70 లక్షలతో డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేశారు. పారిశుద్ధ్యం నిత్యం మెరుగ్గా ఉండేలా సర్పంచ్ పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలు తీర్చడంతోపాటు సచివాలయం నుంచి వారికి అత్యధికంగా సేవలు అందించడానికి కీలక పాత్ర వహించారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారు.

అభివృద్ధి పథంలో పెనుమర్రు

యలమంచిలి మండంలో పెనుమర్రు జనాభా 3 వేలు. సర్పంచ్ కవురు గోపి గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అత్యధికంగా సేవలు అందేలా చూస్తున్నారు. గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 లక్షలతో సచివాలయాన్ని, రూ.30 లక్షలతో రైతు భరోసా భవనం, రూ.30 లక్షలతో వైఎస్సార్ క్లినిక్ భవనాలు నిర్మించారు. గ్రామంలో రూ.20 లక్షలతో డ్రెయినేజీ నిర్మించారు. గ్రామాల్లో పెద్ద సమస్యగా ఉన్న శ్మశాన వాటికకు పరిష్కారం చూపుతూ ఎకరం 30 సెంట్లు సేకరించి అభివృద్ధి చేస్తున్నారు. కరోనా వంటి సమయంలో కూడా గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి నిత్యావసరాలు అందించడం వారి సమస్యలు పరిష్కరిస్తూ సర్పంచ్ ముందుకు సాగుతున్నారు.

వర్క్‌షాపులో ప్రసంగించనున్న అంశాలు

జాతీయ వర్క్‌షాపులో సర్పంచ్‌లు గోపి, సూర్యనారాయణమూర్తి పలు అంశాలపై వివరిస్తారు. వారి గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు కల్పించిన మౌలిక సదుపాయాలు, సచివాలయాల ద్వారా అందించిన సేవలు, వ్యక్తిగత అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, పర్యావరణం తదితర వాటిపై ప్రసంగిస్తారు.

వర్క్‌షాప్‌నకు ఎంపికవ్వడం సంతోషం



జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు జిల్లా నుంచి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం సహకారంతో గ్రామంలో చేసిన అభివృద్ధి, సచివాలయాల ద్వారా ప్రజలకు పారదర్శకంగా సేవలందించడం, నిత్యం అందుబాటులో ఉండి సేవలందించడం సర్పంచ్‌గా సంతృప్తిని ఇస్తుంది. మా సేవలు గుర్తించి జాతీయ స్థాయి వర్క్‌షాపునకు ఎంపిక చేయడం ఎప్పటికీ మర్చిపోలేనిది.

– కవురు గోపి, పెనుమర్రు సర్పంచ్

గొప్ప అవకాశం వచ్చింది



జాతీయ స్థాయిలో మాట్లాడే అవకాశం రావడం సంతోషంగా ఉంది. గ్రామంలో ప్రభుత్వ సహకారంతో చేసిన అభివృద్ధి పనులు, సచివాలయాల సేవలు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండడంతో వారి ఆశీస్సులతో జాతీయ వర్క్‌షాప్‌నకు ఎంపికయ్యాం. వర్క్‌షాపులో మేం చేసిన అభివృద్ధి, సేవల గురించి మాట్లాడతాను.

– అడ్డ వెంకట సూర్యనారాయణమూర్తి, దువ్వ సర్పంచ్

మద్యం మత్తులో కొడుకుపై దాడి

తాడేపల్లిగూడెం రూరల్: మద్యం మత్తులో కొడుకుపై చాకుతో దాడి చేసిన ఘటన తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేట గ్రామంలో జరిగింది. కేసు వివరాలను రూరల్ ఎస్సై వీరభద్రరావు శుక్రవారం వెల్లడించారు. జగ్గన్నపేట గ్రామానికి చెందిన బెజవాడ పల్లయ్య ఆటోడ్రైవర్‌గా జీవిస్తున్నాడు. భార్య మృతి చెందింది. అతనికి కుమారుడు రవి, కోడలు ఉన్నారు. గత రెండ్రోజులుగా తండ్రి పల్లయ్య, కొడుకు రవి మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఊరెళ్ళిన రవి గురువారం సాయంత్రం తిరిగి జగ్గన్నపేట వచ్చాడు. ఈ నేపథ్యంలో మళ్లీ వారి మధ్య తగాదాలు చెలరేగడంతో మద్యం మత్తులో ఉన్న పల్లయ్య చాకుతో కొడుకు రవిపై వీపు భాగంలో దాడి చేశాడు. దీంతో కొద్దిపాటి గాయమైంది. అక్కడే ఉన్న కోడలు బయటకు వచ్చి కేకలు వేయడంతో స్థానికులు రవిని 108 వాహనంలో తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి పంపించారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు ఏరియా ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బెజవాడ రవి

ఇన్‌సైడర్ ట్రేడింగ్‌తో లక్ష కోట్ల దోపిడీ



చీకటిమిల్లి మంగరాజు

తణుకు టౌన్: రాజధాని పేరుతో సంవత్సరానికి మూడు పంటలు పండే భూములను నాశనం చేసి ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు చంద్రబాబు నాయుడు పాల్పడ్డారని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు చెప్పారు. రాజధాని ప్రాంతంలోని భూములను ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా చంద్రబాబు రూ.లక్షల కోట్ల లబ్ధి పొందారని చెప్పారు. దీనిని వ్యతిరేకిస్తూ గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్ళాయిపాలెం జంక్షన్ వద్ద మూడు రాజధానులు, పేదలకు భూములు ఇవ్వాలని చేస్తున్న దీక్షలకు మద్దతు తెల్పుతున్నట్లు తెలిపారు. రాజధానికి మేలు చేసి ఉంటే చంద్రబాబు, లోకేష్‌లు రాజధానిలో తిరిగి సెల్ఫీ చాలెంజ్ ఎందుకు తీసుకోలేదన్నారు. సర్వేలన్నీ ఏపీలో వైఎస్సార్‌సీపీ 25 ఎంపీ సీట్లు గెలుస్తుందని చెబుతున్నాయని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై రాష్ట్ర ప్రజలకు ఎంత నమ్మకం ఉందో తెలుస్తుందన్నారు. చంద్రబాబు ఎన్ని జిమ్మిక్కులు చేసినా, ఎన్ని అబద్ధాలు చెప్పినా రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీకే మళ్లీ పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

ఐక్యతతో ముందుకు సాగాలి



సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: గౌండ సంఘీయులంతా ఐక్యతతో ఉండి అభివృద్ధి చెందాలని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. శుక్రవారం వడలిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతి సందర్భంగా వడలి గౌడ సంఘం, తీత కార్మికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణలో పాల్గొని నివాళులర్పించారు. బీసీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను సీఎం జగన్ ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారన్నారు. పాపన్న గౌడ్ బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ, ఎంపీటీసీలు చిటికెన దుర్గా భవానీ బాబి, రెడ్డి గణేశ్, మాజీ సర్పంచ్ అంగర వరప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు రంభ సూర్యనారాయణ, కాసాని శ్రీనివాసరావు, మద్దు శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వడలిలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ మార్గాని భరత్ రామ్

● **గడపగడపకు సంక్షేమం**



తాడేపల్లిగూడెం అర్బన్ : గడపగడప కార్యక్రమంలో 18వవార్డు ప్రజలతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



నరసాపురం రూరల్ : నరసాపురం రెండో వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి

వృద్ధ దంపతుల ఆత్మహత్య






ఆత్మహత్య చేసుకున్న గంగుమళ్ల నర్సయ్య, గుంగుమళ్ల భూలక్ష్మి

అత్తిలి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వృద్ధ దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అత్తిలిలో జరిగింది. ఎస్సై వి.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం పెరవలి మండలం ముక్కామల గ్రామానికి చెందిన గంగుమళ్ల నర్సయ్య(70), గంగుమళ్ల భూలక్ష్మి(60)లు గత రెండేళ్లుగా అత్తిలిలో నివసిస్తున్నారు. నర్సయ్య కౌలుకు వ్యవసాయం చేసేవాడు. వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పులు చేశాడు. వ్యవసాయన్ని వదిలి ఇటీవల రెండు పాడి గేదెలను కొన్నాడు. అయితే అవి చనిపోవడంతో బంధువులు వద్ద రూ. 3 లక్షలు అప్పులు చేశారని, అప్పులు తీర్చలేని పరిస్థితిలో మనస్తాపానికి గురై గురువారం రాత్రి పురుగుల మందు తాగారన్నారు. అపస్మారకస్థితిలో ఉన్న వీరిద్దరిని శుక్రవారం ఉదయం ఇంటిపక్కన ఉన్న వారు గుర్తించి అత్తిలిలో ఉంటున్న పెద్దకుమార్తె బడేటి కుమారికి సమాచారం ఇచ్చారు. ఆమె అక్కడికి చేరుకుని ఇద్దరినీ 108 వాహనంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, తణుకు సీఐ ఆంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు.

బీజేపీ రాష్ట్ర పధాన కార్యదర్శిగా తపన చౌదరి



ఏలూరు (టూటౌన్): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏలూరుకు చెందిన గారపాటి సీతారామాంజనేయ (తపన) చౌదరి నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆయన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, ఏలూరు జిల్లా పార్టీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా తన నియామకంపై పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

నైపుణ్యం పెంచుకోవాలి



థాట్‌వర్క్స్ కంపెనీ ప్రతినిధి యూ చైతన్య భార్గవి

నూజివీడు: ఆధునిక సాంకేతికత ప్రపంచాన్ని గ్లోబల్ విలేజ్‌గా మార్చిందని, కంప్యూటర్లు, ఇంటర్నెట్ ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని థాట్ వర్క్స్ కంపెనీ క్వాలిటీ ఎస్యూరెన్స్ కన్సల్టెంట్ యూ చైతన్య భార్గవి అన్నారు. స్థానిక ట్రిపుల్‌ఐటీలో సీఎస్‌ఈ, ఈసీఈ విభాగం విద్యార్థులకు శుక్రవారం ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్ టాక్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎస్‌ఈ, ఈసీఈ ప్రజాదరణను పొందిన బ్రాంచిలని, వీటిల్లో విద్యార్థులు నిష్ణాతులుగా మారితే భవిష్యత్ బాగుంటుందన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కావాలనుకునే విద్యార్థులు సాంకేతికత, పరిశ్రమలు, సాఫ్ట్‌స్కిల్స్‌లో ప్రావీణ్యత సాధించాలన్నారు. తగిన స్కిల్స్ లేకపోతే ఉద్యోగ సాధనలో వెనుబడతారన్నారు. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో ఏ సంస్థైనా పోటీని తట్టుకొని నిలబడాలంటే సుశిక్షితులైన, నిపుణులైన మానవ వనరులు అవసరమని, విద్యావంతులైన యువత మార్కెట్ అవసరాలకు సరిపడా స్కిల్స్ చదువుకునేటప్పటి నుంచే పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌ఈ, ఈసీఈ హెచ్‌వోడీలు చిరంజీవి, పీ శ్యామ్, డీన్ అకడమిక్స్ బీ లక్ష్మణరావు, పరిపాలనాధికారి పీ ప్రదీప్‌కుమార్, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వంతెన పైనుంచి పడి మృతి

ఆకివీడు: స్థానిక సిద్ధాపురం వంతెన వద్ద గురువారం రాత్రి మద్యం సేవించి వంతెన పైనుంచి పడి తీవ్రంగా గాయపడిన కట్టా రామకృష్ణను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు ఏఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం చెప్పారు. మండలంలోని సిద్ధాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ ఆకివీడులోని వంతెనపై మద్యం సేవిస్తుండగా కాలువలో ప్రమాదవశాత్తూ పడిపోయాడని, అతని స్నేహితులు బయటకు తీసి స్థానిక ప్రవేటు ఆసుత్రిలో ప్రథమ చికిత్స చేయించారని, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం భీమవరం తరలిస్తుండగా చనిపోయాడు. స్నేహితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం సీజ్

నూజివీడు: అక్రమంగా తరలిస్తోన్న 16.5 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని నూజివీడు మండలం మీర్జాపురం వద్ద శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. విజిలెన్స్ సీఐ పీ శివరామకృష్ణ, సివిల్ సప్లయ్స్ నూజివీడు డీటీ గోళ్ల వెంకటేశ్వరరావులు మీర్జాపురంలోని వేబ్రిడ్జి వద్ద ఐషర్ వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు తేలింది. బియ్యం విలువ రూ.2.97 లక్షలు విలువ చేస్తాయి. పట్టుబడిన వాహనం విలువ రూ.29.83 లక్షలుగా అధికారులు నిర్ధారించారు. బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తోన్న పెద్దిరెడ్డి రామచంద్రరావు, అతని గుమస్తా శివదీపు, తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం మండలం ప్రత్తిపాడుకు చెందిన లారీ యజమాని పడాల సూర్యారావు, డ్రైవర్ తటవర్తి సీతారామయ్య, హెల్పర్ తటవర్తి శ్రీనివాసరావులపై 7(1) ఈసీ చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేశారు.

అట్యా-పాట్యా జట్టు ఎంపిక

సాక్షి, భీమవరం: జిల్లా అట్యా-పాట్యా జట్టు ఎంపిక శుక్రవారం పట్టణంలోని చింతలపాటి బాపిరాజు పాఠశాలలో నిర్వహించినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన రామచంద్రరాజు, జి.కిరణ్ వర్మ తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో కర్నూలులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ అట్యా-పాట్యా పోటీలకు జట్టు పయనమైందన్నారు. ఎం.ఆదిత్య, బి.సతీష్, డి.ప్రసాద్, పి.గోపీకృష్ణ, జె.లోకేష్, కె.ఆర్.వీ గణేష్, ఎస్.దేవేంద్ర, సి.యశ్వంత్ రమణ, డి.మోహర్ కుమార్, ఆర్.దుర్గా ప్రసాద్, డి.కార్తీక్ సభ్యులుగా ఎంపికయ్యారని తెలిపారు.

కాలువలో దూకి విద్యార్థి ఆత్మహత్య





ప్రదీప్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, పామర్తి ప్రదీప్ (ఫైల్)

పెదవేగి: ఉపాధ్యాయుడు మందలించడంతో పదో తరగతి విద్యార్థి పోలవరం కుడికాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం కొప్పాక గ్రామానికి చెందిన పామర్తి రాంబాబు కుమారుడు పామర్తి ప్రదీప్ (16) కొప్పాక జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం ప్రదీప్ గ్రామ సమీపంలో ఉన్న పోలవరం కుడికాలువ గట్టుకు వద్దకు వెళ్లి దూకేశాడు. అటుగా వెళ్తున్న కొంత మంది నీటిలో దూకడం గమనించి, పెదవేగి పోలీసులకు, ఏలూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించారు. వెంటనే స్పందించిన ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కాలువలో గల్లంతైన ప్రదీప్ ఆచూకీ కోసం 4 గంటలు శ్రమించి.. ప్రదీప్ మృత దేహాన్ని వెలికి తీశారు. రాంబాబు, యమునలకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు ప్రదీప్.. గత మూడు రోజుల నుంచి హిందీ ఉపాధ్యాయుడు కింద కూర్చొబెట్టి హేళనగా మాట్లాడడంతో ప్రదీప్ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని, తమకు న్యాయం చేయాలంటూ కొప్పాక హైస్కూల్ వద్ద బాలుడి మృతదేహంతో కుటుంబ సభ్యులు, ఆందోళన చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న డీఈఓ శ్యామ్‌సుందర్ బాధిత కుటుంబంతో మాట్లాడారు. ఉపాధ్యాయుడిపై చేసిన ఆరోపణలపై పాఠశాల ఉపాధ్యాయులందరిని రాత్రి 8.30 గంటలకు పాఠశాలకు పిలిపించి కారణాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఉపాధ్యాయుడిది తప్పుంటే తగిన చర్యలు తీసుకుంటామని డీఈఓ చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

పాలకొల్లు అర్బన్: కృష్ణా జిల్లా ఉయ్యూరు నుంచి కాకినాడకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఏపీ05టీఎం 0652 నెంబరు లారీలో 300 ప్లాస్టిక్ కవర్లలో 150 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం యజమాని మామిడి సాయిబాబు, డ్రైవర్ ఆర్ నాగరాజులపై 6ఏ కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని, లారీతో సహా పాలకొల్లు ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. దాడిలో డివిజనల్ సివిల్ సప్లై అధికారి ఎం.రవి శంకర్, పాలకొల్లు సీఎస్‌డీటీ ఐవీవీ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



క్లుప్తంగా

బలుసులమ్మ ఆలయంలో విశేష పూజలు



బలుసులమ్మకు విశేష పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. దాతలు సహాయ సహకారాలతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారి ఆలయ అభివద్ధి, వెండి వాకిలి నిర్మాణం నిమిత్తం దాతలు టి.వెంకట జగదీశ్వరరావు, భాగ్యలక్ష్మి దంపతులు వెండిని బహూకరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొట్టు అంజిబాబు, వట్టిప్రోలు రాము, పెదప్రోలు భాస్కర్, రంగ నాయకులు, రామస్వామి, వీర కుమార్‌లు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ముత్యాలమ్మ ఆలయంలో చండీహోమం



ముత్యాలంబాపురం ముత్యాలమ్మ వారి ఆలయంలో పూర్ణాహుతి దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం ముత్యాలమ్మ వారి ఆలయంలో శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి నిత్య పూజలతో పాటు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెలవలపల్లి చంద్రశేఖర శర్మ బ్రహ్మత్వంలో ఉదయం సామూహిక వరలక్ష్మీ వ్రతం, గణపతి పూజ, అభిషేకాలు, చండీ హోమం, మహాపూర్ణాహుతి ఇత్యాది పూజా కార్యక్రమాలు జరిగాయి. సతీష్‌కుమార్– శివజ్యోతి దంపతులు పీటలపై కూర్చొని పూజా కార్యక్రమాలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలపై సిబ్బందికి శిక్షణ



ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

ఇరగవరం: మండలంలోని కావలిపురం గ్రామ సర్పంచ్, గోటేరు వార్డు మెంబరు ఎన్నికలు నిమిత్తం శుక్రవారం ఇరగవరం మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులు శ్రీనివాస్‌రావు, ప్రసాద్‌లు పోలింగ్ సిబ్బందికి పోలింగ్‌పై పలు సూచనలు చేశారు. మొత్తం రెండు గ్రామాల్లో 40 మంది పోలింగ్ సిబ్బందిని నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల చదువుకు బాసటగా

పెనుగొండ: తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల చదువుకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు బాసటగా నిలిచారు. అయోధ్యలంక ఎస్సీ కాలనీలో బొంతు వెర్రమ్మ కుమారుడు చిట్టిబాబు, వరలక్ష్మీలు చనిపోవడంతో కనీసం కుటుంబం గడవలేని స్థితిలో మనుమలు ప్రణీయ సతీష్ కుమార్‌తో జీవనం సాగిస్తుంది. స్థానిక నాయకులు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు సమస్యను విన్నవించుకోవడంతో వారికి అండగా నిలిచి వారికి చదువుకు, భోజనానికి అవసరమైన సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి కృష్ణవేణి, ఎంపీటీసీ కంచుస్తంభం శ్రీను, గొల్లపల్లి బాలకృష్ణ, ఎం.సత్యనారాయణ, సరిళ్ల రాజు, తరపట్ల శ్రీరామమూర్తి, డాక్టర్ సత్యనారాయణ, బి.దాసు పాల్గొన్నారు.

నేడు 'చరిత్ర మరిచిన చిత్తరువు' పుస్తకావిష్కరణ

నరసాపురం రూరల్: దివంగత మాజీ ఎమ్మెల్యే, కామ్రేడ్ పడాల శ్యామసుందరరావు జీవిత చరిత్రకు సంబంధించి రచించిన 'చరిత్ర మరిచిన చిత్తరువు' పుస్తకావిష్కరణ సభ శనివారం సాయంత్రం 3 గంటలకు నరసాపురంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైఎన్ కళాశాల సెమినార్ హాలులు జరిగే ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు హాజరవుతార పేర్కొన్నారు. దారిదీపం ఎడిటర్ డీవీవీఎస్ వర్మ పుస్తకావిష్కరణ చేస్తారని, ఏపీజేయూ జాతీయ కార్యదర్శి దూసనపూడి సోమసుందర్ పుస్తక సమీక్ష చేస్తారని శ్యామసుందర్ కుటుంబీకులు తెలిపారు.

రైల్వేగేటు వద్ద శాశ్వతంగా రాకపోకలు బంద్

- ఆర్వోబీ నిర్మించాక పాదచారులకు అవకాశం
- ప్రయాణికులు, విద్యార్థులకు తప్పని అవస్థలు



పూర్వపు రైల్వేగేటు వద్ద శాశ్వతంగా రాకపోకలు నిలిపివేత

తణుకు: పట్టణంలోని పూర్వపు రైల్వేగేటు వద్ద రాకపోకలను రైల్వే అధికారులు శాశ్వతంగా నిలిపివేశారు. దాదాపు 15 ఏళ్ల క్రితం ఆర్వోబీ నిర్మించిన అనంతరం రైల్వే గేటు వద్ద వాహనాలకు రాకపోకలు నిలిపివేసినప్పటికీ పాదచారులు, ప్రయాణికుల రాకపోకలకు వీలుగా అవకాశం కల్పించారు. అయితే ఇటీవల రైల్వే డబ్లింగ్ నిర్మాణ పనులు అనంతరం రైళ్ల రాకపోకలు పెరగడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో స్పందించిన రైల్వే అధికారులు ఈ ప్రాంతంలో రాకపోకలు నిలిపివేసి శాశ్వతంగా గడ్డర్లు ఏర్పాటు చేశారు. దీంతో కనీసం జంతువులు కూడా వెళ్లే అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో పైడిపర్రు వైపు వెళ్లాలంటే మెట్లు ఎక్కి ఆర్వోబీ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రయాణికుల ఇబ్బందులు...

తణుకు పట్టణ పరిధిలోని బస్టాండు నుంచి రైల్వేస్టేషన్‌కు నడకదారి ద్వారా రాకపోకలు సాగించాలంటే ఈ మార్గం తప్పనిసరి. పూర్వపు రైల్వే గేటు ఆనుకుని బస్టాండు ఉండటంతో పొరుగు ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణీకులు ఇక్కడే ఆటో దిగి రైల్వే గేటు దాటి బస్టాండుకు వెళుతుండేవారు. దీంతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉండేది. మరోవైపు రాత్రి సమయాల్లో రైలు దిగిన ప్రయాణీకులు బస్సు ఎక్కాలంటే ఇదే మార్గం నుంచి వెళ్లాలి. తాజాగా ఈ ప్రాంతంలో రాకపోకలు నిషేధించడంతో ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు తణుకు నుంచి పైడిపర్రు వెళ్లేందుకు సైతం దగ్గరి దారి కావడంతో విద్యార్థులు, స్థానికులకు వెసులుబాటుగా ఉండేది. ప్రస్తుతం ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేసి రైలు పట్టాలకు ఇరువైపులా సిమ్మెంటు దిమ్మలతో గోడ ఏర్పాటు చేశారు. ఈ పరిస్థితుల్లో అటుగా వెళ్లే ప్రయాణీకులు, విద్యార్థులు మెట్లు మార్గం ద్వారా ఆర్వోబీ ఎక్కి బస్టాండు ఎదురుగా ఉన్న మెట్లు దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిత్యం ప్రమాదాలు...

రైల్వే డబ్లింగ్ పనులు అనంతరం ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు పెరిగాయి. ముఖ్యంగా గూడ్సు రైళ్ల సంఖ్య పెరగడంతో ఈ మార్గం రద్దీగా మారింది. దీంతో ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. గత మూడు నెలల వ్యవధిలోనే నలుగురు మృత్యువాత పడ్డారు. పలువురు బిక్షాటన చేసుకునే వారు సైతం ఇదే ప్రాంతంలో నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. మరోవైపు ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు సైతం జరుగుతుండటంతో ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులు ఈ ప్రాంతంపై దృష్టి సారించారు. రాత్రి సమయాల్లో ఈ ప్రాంతంలో గొడవలు సైతం జరుగుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు ఈ ప్రాంతంలో రాకపోకలు నిలిపివేశారు. మరోవైపు పశువులు సైతం రైలు పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రమాదాల నివారణకు...

పూర్వపు రైల్వే గేటు వద్ద రైలు పట్టాలు దాటుతున్న సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. డబ్లింగ్ పనులు అనంతరం రైళ్ల వేగం పెరిగింది. ఈ ప్రాంతంలో ప్రమాదాలు నివారించాలనే ఉద్దేశ్యంతోనే ఇరువైపులా శాశ్వతంగా రాకపోకలు నిలిపివేశాం.

– ఎన్‌వీఆర్ ప్రభాకరరావు, స్టేషన్ సూపరింటెండెంట్, తణుకు

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



హెల్మెట్ పెట్టుకోవాలని అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుబ్రహ్మణ్యం

పెంటపాడు: రహదారి భద్రత సూచనలు ప్రజలు తప్పక పాటించాలని, తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించుకోవచ్చని గూడెం ట్రాఫిక్ ఎస్సై సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం గూడెం, పెంటపాడు ప్రాంతాల్లో హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రద్దీ ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణలు తప్పక పాటించాలన్నారు. వాహనదారులు తప్పకకుండా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



అత్తిలిలో మానవత శాంతి ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, యూనిట్ సభ్యులు



పెంటపాడు మానవత శాంతి ర్యాలీని ప్రారంభిస్తున్న రూరల్ సీఐ మూర్తి

అత్తిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అన్నారు. మానవత శాంతి ర్యాలీ వారోత్సవాల్లో భాగంగా అత్తిలి మానవత యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శాంతిర్యాలీని ఎంపీపీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా సేవలు అత్తిలిలో అవసరార్థులకు అందుతున్నాయని, ఈ సంస్థ ద్వారా మరిన్ని సామాజిక సేవలు విస్తృత పర్చాలని కోరారు. అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని మానవత జెండాలతో అత్తిలి పురవీధులలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షుడు బోడపాటి సూర్యచంద్రరావు, ఆనాల ఆదినారాయణ, కొరిపల్లి హరి, జీవై వెంకటరమణ, ఆకుల ఆంజనేయులు, కొరిపల్లి విజయకుమార్, బడేటి వెంకటేశ్వరరావు, ముదునూరి బాలకృష్ణంరాజు, అప్పారావు, కుక్కల వెంకటరామారావు, తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అమోఘం

పెంటపాడు: మానవత సేవలు అభినందనీయమని గూడెం రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి అన్నారు. మండల మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మానవత నూతన చైర్మన్ తాడేపల్లి మోహనరావు ఆధ్వర్యంలో పెంటపాడు ఎస్‌వీవీఎన్ హిందూ హైస్కూల్ నుంచి ప్రభుత్వ బేసిక్‌స్కూల్ వరకు విద్యార్థులతో మానవత సంస్థ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రూరల్ సీఐ మూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో శాంతి స్థాపన జరిగేందుకు, ప్రతిఒక్కరు సుఖశాంతులతో జీవించేందుకు మానవత్వంలో ప్రతీవారు సేవ చేయాలన్నారు. మానవత సంస్థ ఏర్పాటు సేవలను కొనియాడారు. జిల్లా మానవత చైర్మన్ తాడేపల్లి మోహనరావు మాట్లాడుతూ శాంతి ద్వారానే మానవుని ఆలోచనలు సక్రమంగా ఉంటాయన్నారు. మానవత సంస్థ సేవలు మరింత విస్తృతం కావాలన్నారు. అనంతరం స్థానిక మానవత సభ్యుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పెంటపాడు గేట్ సెంటర్‌లో మానవహారం చేశారు. మానవత నాయకులు తారాడి పాల్, నల్లమిల్లి ప్రభాకరరెడ్డి, కుదుళ్ల నారాయణ రావు, వై. వీరాస్వామి, జార్జ్, జి. కృష్ణమోహనరావు, మానుకొండ మార్కు, జి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు శశికపూర్, స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ సర్వసభ్య సమావేశం



తణుకులో సత్కారం పొందిన సీనియర్ ఫొటోగ్రాఫర్స్‌తో షబ్బీర్, అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: ఫొటోగ్రఫీలో దినదినాభివృద్ధి చెందుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని ఫొటోగ్రాఫర్లు అభివృద్ధి చెందాలని తణుకు ఏరియా ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్, మిక్సింగ్ యూనిట్స్, డిజైనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ షబ్బీర్ అన్నారు. తణుకు బీసీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ సభ్యులంతా ఐక్యంగా ఉండి తమ వృత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 9 మంది సీనియర్ ఫొటోగ్రాఫర్స్‌ను అసోసియేషన్ తరఫున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి లంక సోమేశ్వరరావు, కోశాధికారి రాగూరి నాగరాజు, కార్యవర్గ సభ్యులు సలాది ఉదయ భాస్కరరావు, చివటం సత్యకోటిచుక్కల సుబ్బారావు, నక్క సత్యనారాయణ, సిద్ధాంతం చిన్ని, చందు, నాగరాజు, ఫణి, సంతోష్‌కుమార్, షేక్ జానీ, చందు తదితరులు పాల్గొన్నారు.

చర్మకారుల అభివృద్ధికి లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలి



తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేట గ్రామంలో జరిగిన దళితన సేన సమావేశం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: చర్మకారుల అభివృద్ధికి లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో దళిత సేన సమావేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లెదర్ పార్కుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినా ఇప్పటి వరకు ఆచరణ సాధ్యం కాలేదన్నారు. దీంతో చర్మకారుల అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చర్మకారుల అభివృద్ధిలో భాగంగా లెదర్ ట్రైనింగ్ సెంటర్ విజయవాడలో ప్రారంభించాలని, రాష్ట్ర ప్రభుత్వం లిడ్ క్యాప్ చెర్మన్ కాకుమాను రాజశేఖర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రుణాల మంజూరులో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్న లిడ్ క్యాప్ ఎండీని తక్షణమే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గ్రామ దళిత సేన నాయకులు చింతయ్య, మండల అధ్యక్షుడు ఉండ్రాజవరపు కృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు కంకిపాటి కుటుంబరావు, ఉపాధ్యక్షుడు కిలాడి రవి, కడియద్ద గ్రామ అధ్యక్షుడు గెద్దం సుందరరావు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక నిఘా

సాక్షి, భీమవరం: భీమవరం శివారు ప్రాంతాలకు సైతం మంచినీరు సరఫరా చేసేవిధంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ఓహెచ్‌ఆర్‌లు పూర్తిస్థాయిలో నింపుతున్నదీలేనిదీ తెలుసుకోడానికి ఓహెచ్‌ఆర్ లోపల సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మంచినీటి సరఫరాకు సంబంధించి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని శివారు ప్రాంతాలకు కొన్నిచోట్ల తాగునీరు అందడం లేదనే ఫిర్యాదులు వస్తున్నట్టు చెప్పారు. పంపింగ్ విధానంలో ఉన్న కొన్ని లోపాల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. వర్షాకాలంలో సైతం తాగునీటి ఇబ్బంది ఉన్న శివారు ప్రాంతాలకూ ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని వివరించారు. పట్టణంలో అమృత పథకంలో నిర్మిస్తోన్న రిజర్వాయర్లను మరో రెండు నెలల్లో వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. 39వ, 4వ వార్డుల్లో నిర్మించిన రిజర్వాయర్లకు త్వరలో ట్రయల్ రన్ నిర్వహిస్తామని చెప్పారు. తాగునీటి సరఫరాపై తాను, మున్సిపల్ ఎంఈ నిత్యం పర్యవేక్షణ చేస్తామని ఎమ్మెల్యే శ్రీనివాస్ చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే శ్రీనివాస్ అన్నారు. భీమవరం నియోజకవర్గంలో దళిత, దళిత క్రైస్తవుల నివాసిత ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పట్ల సంతృప్తితో శుక్రవారం దళిత ఐక్యవేదిక నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగేళ్ల పాలనలో భీమవరం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేశామని, కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలుచేస్తోన్న ఘనత జగన్‌కే దక్కుతుందని చెప్పారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- 18వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 18వవార్డు ప్రజలతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకొని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టుసత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని 18వ వార్డులో గడపగడప కార్యక్రమంలో శుక్రవారం ఆయన ప్రజలను కలిసి వారికి అందిన సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే ప్రజలు మద్దతు పలుకుతున్నారని, 2024 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి ఓట్లు వేసి మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం 18వార్డుకు చేసిన అభివృద్ధిని తెలపాలని ప్రశ్నించారు. రెండు సార్లు నేను ఎమ్మెల్యేగా గెలిచి తాను చేసిన అభివృద్ధే తప్ప గతంలో వచ్చిన వారు ఎవరూ ప్రజలకు మౌలికసౌకర్యాలు అందజేయలేదని గుర్తు చేశారు. జనసేన కార్యకర్తలు రోడ్డుమీద గుంతలలో నాలుగు తట్టలు మట్టి పోసి ఫొటోలు తీయించుకుంటున్నారని ఆరోపించారు. తెదేపా నాయకులు విచ్చలవిడిగా దోచేశారని దుయ్యబట్టారు. జగన్ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకోవడమే ఆలస్యం అవినీతికి తావు లేకుండా నిస్వార్థంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. వలంటీరు ప్రజలకు సేవలందిస్తుంటే వారిపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. వలంటీర్లను దండుపాళ్యం ముఠా అనడం పవన్‌కు బుద్ధి, జ్ఞానం లేదన్నారు. ప్రజలు చంద్రబాబుని దుర్మార్గుడిగా వర్ణిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్‌ను జీరో చేసి చంద్రబాబు ప్రతిపక్షంలోకి రావాలని కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. పురాణాల్లో యజ్ఞాలను రాక్షసులు నాశనం చేసినట్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ యజ్ఞాన్ని రాక్షసుడు చంద్రబాబు, అజ్ఞాని పవన్‌లు పాడుచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వారిని ప్రజలు నమ్మక పోయినా మేమున్నాం అంటూ ప్రజల వద్దకు రావడానికి వారికి సిగ్గులేదని విమర్శించారు. 2024లో వారందరికీ మైండ్‌బ్లాక్ అయ్యేలా జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజలు సమాయత్తం అయ్యారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన అందిజేస్తున్నారని తెలిపారు. ప్రజలకు మంచి చేస్తుంటే చంద్రబాబు ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలే సరైన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, వలంటీర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



కావలిపురం గ్రామంలో ఉప ఎన్నికల ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రవి ప్రకాష్

ఇరగవరం: మండలంలోని కావలిపురం సర్పంచ్, గోటేరు వార్డు నెంబర్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్ శ్రీనివాస్‌రావు తెలిపారు. కావలిపురం గ్రామంలో మొత్తం 10 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. మొత్తం 2,290 మంది ఓటర్లు ఉండగా అందులో 1170 మంది స్త్రీలు, 1120 మంది పురుషులు ఉన్నారు. గ్రామా పంచాయతీ ఎంపియుపి స్కూల్, మహిళ మండలి భవనల వద్ద పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. 37 మంది పివోలు, ఏపివోలు విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల సూపర్‌వైజర్ శివప్రసాద్ యాదవ్, జిల్లా ఎస్పీ యు రవి ప్రకాష్, ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఓటింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందన్నారు. ఓట్ల ప్రక్రియా పూర్తి అయిన వెంటనే మండల పరిషత్ పాఠశాలల్లో కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు.

వార్డు ఉప ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు

తణుకు టౌన్: మండలంలోని తేతలి గ్రామ పంచాయతీ 8వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో పీ శ్రీనివాసరావు తెలిపారు. తేతలి గ్రామంలోని 8వ వార్డులో మొత్తం 467 మంది ఓటర్లకు పోలింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారిలో పురుషులు 231, మహిళలు 236 ఓట్లు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారి ఎంఈవో మురళీ సత్యనారాయణ, పోలీస్ ఆఫీసరుగా బాబూరావులతో పాటు మరో ముగ్గురు ఓపీవోలను నియమించినట్లు తెలిపారు. పోలింగ్ శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు. ఉప ఎన్నిక దృష్ట్యా గ్రామంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా శుక్రవారం ఉదయం నుంచి 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు తెలిపారు. ఉప ఎన్నిక ప్రశాంతంగా జరిగేలా నాయకులు సహకరించాలని ఎంపీడీవో కోరారు.

ఆలయాల్లో శ్రావణ శుక్రవారం శోభ



సామూహిక వరలక్ష్మి వ్రతాలు చేస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రావణ మాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని మహిళా భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. పట్టణంలోని సీతారాంపేట శ్రీరామాలయంలో అధ్యక్షుడు నరిసే సోమేశ్వరరావు సౌజన్యంతో రామాలయ మహిళా కమిటీ వారిచే శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఆలయంలో విశేష పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ వాసవిలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో శ్రావణమాసం శుక్రవారం పురస్కరించుకుని మహా మహిమాన్విత మణిద్వీప వర్ణ పారాయణ పూజ ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 100 మంది మహిళలు సామూహిక పూజలు చేశారు. తొమ్మిది రకాల పువ్వులతో అర్చకులు సత్యనారాయణ శర్మ, తరుణ్ శర్మలు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆర్యవైశ్య నాయకులు మండవల్లి నాగేంద్రరావు, కోశాధికారి నున్న సుందరరావు, ఆలయ సెక్రటరీలు ఆలపాటి చిన్నా, కురిసేటి శ్యామ్, మహిళలు ఆలపాటి అచ్యుత లక్ష్మి, కొండూరు కనకదుర్గ, పచ్చిపులుసు శారదారాణి, వనిత క్లబ్ సభ్యులు తదితరులు పర్యవేక్షించారు.

దళితులకు అండగా ప్రభుత్వం

యలమంచిలి: జగనన్న ప్రభుత్వం ఎల్లప్పుడూ దళితులకు పూర్తి అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. యలమంచిలి సెంటర్లోని తమ్మినీడి ఉమా నరసింహ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి వైఎస్సార్ సీపీ దళిత సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దళితులకు ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో అందించడానికి కృషి చేయడంతోపాటు స్థానిక సంస్థల పాలనలోను దళితులకు తగు ప్రాధాన్యత ఇస్తానని గోపి హామీ నిచ్చారు. ఈ సందర్భంగా దళిత నాయకులంతా గోపీని శాలువా, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఉచ్చుల స్టాలిన్, జవదాల సువర్ణరాజు, మోకా నరసింహారావు, బొంతు వెంకట కర్ణారెడ్డి, విప్పర్తి నవీన్, మేడిది విజయ జ్ఞానమణి,తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఇద్దరి అరెస్ట్

కాళ్ల: మండలంలోని సీసలిలో పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. గ్రామంలో గుత్తుల కోటేశ్వరరావు, నెలపర్తి సుబ్బారావులు పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు కాళ్ల ఎస్సై ఎజీఎస్ మూర్తి సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్దనుండి రూ.20,890 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

సాక్షి, భీమవరం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం భీమవరం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాడేరు రోడ్‌లోని జడ్డు బ్రహ్మాజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు గోపిశెట్టి మురళీ కృష్ణారావు, అధ్యక్ష, కార్యదర్శులు టంకాల శ్రీకాంత్, కె.సత్య, కె.కృష్ణ, జడ్డు ప్రసాద్, జె.నాగు, పి.అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.